క్లుప్తంగా

ఎరువులు పక్కదారి పడితే చర్యలు : జేడీఏ

అనంతపురం అగ్రికల్చర్: నిబంధనలకు అనుగుణంగా డీలర్లు, దుకాణాదారులు రైతులకు ఎరువులు విక్రయించాలని, ఎరువులు పక్కదారి పట్టించినా, ఎంఆర్‌పీకి మించి అమ్మినా కఠిన చర్యలు తప్పవని వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ హెచ్చరించారు. శుక్రవారం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో కోరమాండల్, ఇఫ్కో కంపెనీ ఆధ్వర్యంలో ఎరువుల అంశంపై అధికారులు, డీలర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీఏ మాట్లాడుతూ... కొత్త సాఫ్ట్‌వేర్ అందుబాటులోకి వచ్చినందున పాత ఈ–మిషన్ స్థానంలో జిల్లాకు 785 ఈ–పాస్ మిషన్లు మంజూరైనట్లు తెలిపారు. అందులో ప్రస్తుతానికి 65 మిషన్లు సొసైటీలు, డీలర్లకు పంపిణీ చేస్తున్నామన్నారు. రెండు మూడు రోజుల్లో అందరికీ ఇస్తామన్నారు. ఇక ఖరీఫ్ 1.10 మెట్రిక్ టన్నులు, రబీలో 75 వేల మెట్రిక్ టన్నుల వరకు ఎరువులు అవసరం ఉంటుందన్నారు. కేటాయింపుల మేరకు కంపెనీలు నెలవారీగా ఎరువులు సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ పెన్నేశ్వరి, అధికారులు విజయకుమార్, చెన్నవీరస్వామి, బాలానాయక్ పాల్గొన్నారు.

వృద్ధురాలి ఆత్మహత్య

బెళుగుప్ప: మండలంలోని గంగవరం గ్రామానికి చెందిన గంట్ల లక్ష్మీదేవి (70) ఆత్మహత్య చేసుకుంది. కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్న ఆమెకు కుటుంబసభ్యులు చికిత్స చేయిస్తున్నారు. అయినా ఫలితం లేకపోవడంతో జీవితంపై విరక్తి పెంచుకున్న ఆమె శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. ఆలస్యంగా ఇంటికి చేరుకున్న కుటుంబసభ్యులు అప్పటికే అపస్మారక స్థితికి చేరుకున్న లక్ష్మీదేవిని కళ్యాణదుర్గంలోని సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక ఆమె మృతి చెందింది. మృతురాలి కుమారుడు వెంకట్రాముడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆర్టీసీలో కదిలిన అక్రమాల డొంక

- మలువు తిరిగిన ఆర్టీసీ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ విభాగం అక్రమాల బాగోతం
- భారీగా ముడుపులు దండుకుని తప్పుడు నివేదిక ఇచ్చిన విజిలెన్స్ అసిస్టెంట్ డైరెక్టర్
- వాస్తవాలు బయటపడడంతో దీర్ఘకాలిక సెలవులో అధికారి
- జోనల్ విజిలెన్స్ అధికారి ముజఫర్ రహిమాన్ బాధితుల జాబితా చూసి తలలు పట్టుకుంటున్న అధికారులు



అనంతపురం క్రైం: ఆర్టీసీలో జోనల్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ విభాగంలో చోటు చేసుకున్న అక్రమాల తీగ లాగిన కొద్ది కొత్త విషయాలు బయటపడుతున్నాయి. ఆర్టీసీ ఆదాయానికి పటిష్ట రక్షణ కవచంగా ఉండాల్సిన విజిలెన్స్ విభాగంలోని ఉన్నత స్థాయి అధికారులే అందిన కాడికి దోచుకున్నట్లుగా ఇప్పటికే విచారణాధికారులు నిగ్గు తేల్చారు. కడప జోనల్ పరిధిలోని మూడు జిల్లాల్లో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ అక్రమాలకు పాల్పడిన విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ అధికారి ముజఫర్ రహిమాన్ అవినీతి సెగ ప్రస్తుతం ప్రధాన కార్యాలయాన్ని తాకింది.

ముజఫర్ ముఠాకు మహిళా అధికారి దన్ను

ముజఫర్ అక్రమాలపై కొందరు బాధితులు నేరుగా విజయవాడలోని ప్రధాన కార్యాలయానికి ఫిర్యాదు చేశారు. దీంతో ప్రధాన కార్యాలయంలోని విజిలెన్స్ ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని ఓ మహిళా అధికారినికి బాధ్యతలు అప్పగించారు. అప్పటి విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ విభాగం అసిస్టెంట్ డైరెక్టరుగా పనిచేస్తున్న సదరు అధికారి రంగంలోకి దిగి విచారణ పేరుతో నాటకీయ పరిణామాలకు తెరలేపారు. చివరకు ముజఫర్ ఎలాంటి తప్పిదాలకు పాల్పడలేదంటూ ఓ నివేదిక ఇచ్చి చేతులు దులుపుకున్నారు. అయితే క్లీన్‌చిట్ ఇచ్చేందుకు ముజఫర్ నుంచి రూ.5 లక్షలు సదరు అధికారి తీసుకున్నట్లు తాజా విచారణలో వెలుగు చూసింది. ఈ విషయం తెలుసుకున్న సదరు అధికారి వెంటనే దీర్ఘకాలిక సెలవులో వెళ్లిపోయినట్లు విస్తృతంగా చర్చ సాగుతోంది. ఆమె అక్రమాలకు సంబంధించిన బలమైన ఆధారాలను విచారణాధికారులు సేకరించారు. ఈ నివేదిక ఇంకా ప్రధాన కార్యాలయానికి చేరకనే ఆమె లాంగ్ లీవుపై వెళ్లడం అనుమానాలకు తావిస్తోంది.

లోతైన దర్యాప్తు చేయాలి

ముజఫర్ రహిమాన్ పని చేసిన సమయంలో ఉద్యోగులు, కార్మికులపై వచ్చిన అన్ని ఆరోపణలపై తిరిగి విచారణ చేపట్టాలని ఆర్టీసీలోని వివిధ యూనియన్ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఓ కమిటీ ఆధ్వర్యంలో బహిరంగ విచారణ జరిపాలని కోరుతున్నారు. ఈ విచారణ జరిపితే అనంతపురం రీజినల్ కార్యాలయంలోని పెద్దల అవినీతి బాగోతాలు కూడా బయటపడతాయని వాదిస్తున్నారు.

వెలుగు చూస్తున్న అక్రమాల బాగోతం

కింది స్థాయి సిబ్బందిపై ఆరోపణ వస్తే చాలు వెనక ముందు ఆలోచించకుండా విచారణ పేరుతో పిలిపించి అందిన కాడికి విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ అధికారి ముజఫర్ రహిమాన్ దోచుకున్నారు. ఈ క్రమంలో తప్పుచేసిన వారు బయటపడ్డామని సంబరపడితే.. ఎలాంటి తప్పు చేయని వారు అనవసరంగా డబ్బు పోగొట్టుకున్నామని బాధపడ్డారు. ఈ అక్రమాలపై బాధితుల నుంచి ఫిర్యాదులు అందుకున్న ఉన్నతాధికారులు సమగ్ర విచారణకు ఆదేశించారు. దీంతో కడప జోనల్ పరిధిలోని మూడు జిల్లాల్లో ఈ తరహా బాధితులు సుమారు 60 మందికి పైగా ఉన్నట్లు విచారణ అధికారులు నిగ్గు తేల్చారు. 2023 నుంచి ఇప్పటి వరకు విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ అధికారిగా పనిచేసిన ముజఫర్ రహిమాన్ ఇష్టారాజ్యంగా అక్రమాల బాగోతం ఒక్కొక్కటిగా వెలుగు చూసింది. ఈ మొత్తం వ్యవహారం చూసిన విచారణాధికారులు తలలు పట్టుకుంటున్నారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్


నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

రాయదుర్గం: తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగను అరెస్ట్ చేసినట్లు రాయదుర్గం సీఐ వెంకటరమణ తెలిపారు. వివరాలను ఆయన వెల్లడించారు. శుక్రవారం ఉదయం కణేకల్లు క్రాస్‌లో కణేకల్లు ఎస్‌ఐ నాగమధు ఆధ్వర్యంలో సిబ్బంది వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా వచ్చిన కళ్యాణదుర్గానికి చెందిన యువకుడు పిట్ట గంగాధర అలియాస్ సాంబ ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండడంతో అదుపులోకి తీసుకుని విచారణ చేయడంతో చోరీల అంశం వెలుగు చూసింది. క్రికెట్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్‌కు ఇతర వ్యసనాలకు బానిసగా మారి తన అవసరాలు తీర్చుకునేందుకు దొంగతనాలకు పాల్పడుతూ వచ్చినట్లుగా అంగీకరించాడు. ఏడాదిన్నర కాలంగా కణేకల్లులో 2, రాయదుర్గం, కళ్యాణదుర్గం, అనంతపురం పీఎస్‌ల పరిధిలో ఒక్కొక్కటి, అన్నమయ్య జిల్లా రాయచోటిలో 1, అనంతపురం రూరల్ పరిధిలో 2 చోరీ కేసుల్లో నిందితుడిగా పోలీసులు గుర్తించారు. నిందితుడి నుంచి రూ.48 లక్షలు విలువ చేసే బంగారు నగలు, వెండి సామగ్రిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

దర్గాహొన్నూరులో నీటి సమస్య పరిష్కారం


దర్గాహొన్నూరులో కొళాయి వద్ద నీరు తీసుకెళ్తున్న ప్రజలు

బొమ్మనహాళ్: మండలంలోని దర్గాహొన్నూరులో నీటి సమస్య పరిష్కారమైంది. 25 రోజులుగా గ్రామస్తులు నీటి ఎద్దడితో అల్లాడుతున్నారు. వేసవిలో తాగునీరు లేక జనం అల్లాడుతున్నా అధికారులు, అధికార పార్టీ ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతోనే నీటి సమస్యను పట్టించుకోలేదన్నారు. గ్రామంలో వాటర్ ప్లాంట్ ఒక్కటే ఉండడంతో ఏమాత్రం సరిపోలేదని, శ్రీరామరెడ్డి పథకం నీరు కూడా సరఫరా కాకపోవడంతో నీటి సమస్య తలెత్తింది. దీంతో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వన్నల్లి రామాంజనేయులు, సర్పంచ్ శకుంతలమ్మ, ఎంపీటీసీ రామకృష్ణలు తాగునీటి సమస్యను గుర్తించారు. అధికారులతో మాట్లాడి దర్గాహొన్నూరు సమీపంలో ఉన్న వన్నల్లి గ్రామ శివారులో బోరు వేయించారు. బ్రహ్మయ్య ఆలయం వరకు పైప్‌లైన్ చేసి, అక్కడ ప్రజలకు తాగునీటి కొళాయిని ఏర్పాటు చేశారు. మంచి నీటి కొళాయిని ఏర్పాటు చేయడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఏడాదిలో అనంత రైల్వే స్టేషన్ విస్తరణ పనులు పూర్తి

- కేంద్ర రైల్వే సహాయ మంత్రి సోమన్న


అనంత రైల్వే స్టేషన్‌లో పర్యటిస్తున్న రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్న, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం సిటీ: అమృత్ భారత్ పథకం కింద అనంతపురం రైల్వే స్టేషన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను 2026 నాటికి పూర్తి చేస్తామని కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్న తెలిపారు. శుక్రవారం ఆయన ఎంపీ అంబికా లక్ష్మీనారాయణతో కలసి స్థానిక రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. రైల్వే శాఖ అధికారులు, ఇంజినీర్లతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంపీ అంబికాతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. అనంతపురం రైల్వే స్టేషన్ విస్తరణలో భాగంగా తొలి విడతలో రూ.30 కోట్లు, మలి విడతలో రూ.22 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు వివరించారు. ఎస్కలేటర్ సదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు. పుట్టపర్తి–బెంగళూరు మధ్య నడిచే మెమూ రైలును అనంతపురం వరకు పొడిగించినట్లు వెల్లడించారు. అనంతపురానికి మరిన్ని రైల్వే సర్వీసులు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు మౌలిక సదుపాయాల ఆధునికీకరణకు చర్యలు తీసుకోవాలని ఎంపీ కోరారు. ఢిల్లీ వెళ్లే రాజధాని ఎక్స్‌ప్రెస్‌కు అనంతపురంలో హాల్ట్ కల్పించాలని, ధర్మవరం–మచిలీపట్నం రైలుకు రాయలచెరువు స్టేషన్‌లో స్టాపింగ్‌కు చొరవ చూపాలని విన్నవించారు. గుంతకల్లు డీఆర్‌ఎం చంద్రశేఖర్ గుప్తా, అనంతపురం రైల్వే స్టేషన్ మేనేజర్ మాసినేని అశోక్‌కుమార్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడిగా శంకరనారాయణశర్మ


శంకర నారాయణశర్మ

రాయదుర్గం టౌన్: రాయదుర్గం నియోజకవర్గం బ్రాహ్మణ సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడిగా శంకర నారాయణశర్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం స్థానిక కోటలోని గాయత్రి భవన్‌లో జరిగిన సమావేశంలో శంకర నారాయణశర్మను నూతన అధ్యక్షుడిగా ప్రకటించారు. మరో 10 మందిని కార్యవర్గ సభ్యులుగా వారంరోజుల తర్వాత ఎన్నుకోనున్నట్లు తెలియజేశారు.

చోరీ కేసులో నిందితుల అరెస్ట్

- 4.5 కిలోల వెండి సామగ్రి, తులం బంగారం స్వాధీనం


నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

కళ్యాణదుర్గం రూరల్: నియోజవర్గ వ్యాప్తంగా పలు ఆలయాల్లో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరిని కళ్యాణదుర్గం రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక రూరల్ పీఎస్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను ఏఎస్‌ఐ రామాంజనేయులుతో కలసి సీఐ వంశీకృష్ణ వెల్లడించారు. కళ్యాణదుర్గం రూరల్, కంబదూరు పీఎస్ పరిధిలో గత ఎనిమిది నెలలుగా దేవాలయాల్లో చోరీలు జరిగాయి.రెండు స్టేషన్ల పరిధిలో మొత్తం నాలుగు కేసులు నమోదుకాగా, డీఎస్పీ రవిబాబు పర్యవేక్షణలో రూరల్ పోలీసులు సమగ్ర దర్యాప్తు చేపట్టారు. ఈ నేపథ్యంలో శుక్రవారం కళ్యాణదుర్గం మండలం హులికల్లు గ్రామం వద్ద అనుమానాస్పదంగా తచ్చాడుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో ప్రశ్నించడంతో ఆలయాల్లో చోరీలకు పాల్పడింది తామేనని అంగీకరించారు. పట్టుబడిన వారిలో ఆరుల రాజశేఖర్, గొల్ల బొబ్బిలి రాము ఉన్నారు. వీరి నుంచి 4.5 కిలోల వెండి సామగ్రి, ఒక తులం బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు.నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. కాగా, ఇదే కేసులో పరారీలో ఉన్న మరో ఇద్దరి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులందరూ ఒకే కుటుంబానికి చెందిన వారిగా గుర్తించారు. విజయనగరం జిల్లాకు చెందిన వీరు సంచార జీవనం సాగిస్తూ ఓ ప్రాంతంలో కొన్ని నెలల పాటు తిష్ట వేసి, ఆ ప్రాంతంలోని ఆలయాల్లో చోరీలకు పాల్పడేవారు. వీరికి ఆధార్‌కార్డులు లేకపోవడంతో చోరీ జరిగిన సమయంలో వేలి ముద్రలు లభ్యమైనా ఆచూకీ దొరకకుండా తప్పించుకుని తిరిగేవారని పోలీసులు తెలిపారు.

ఖేలో ఇండియా పోటీల్లో కాంస్య పతకాలు


జాతీయ స్థాయిలో కాంస్య పతకాలను సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న సెపక్‌తక్రా జిల్లా చైర్మన్

ఉరవకొండ: ఖేలో ఇండియా జాతీయ స్థాయి సెపక్‌తక్రా పోటీల్లో అనంతపురం జిల్లాకు చెందిన క్రీడాకారులు కాంస్య పతకాలు సాధించి, ప్రధానిమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు. శుక్రవారం జాతీయ స్థాయిలో కాంస్య పతకాలు సాధించిన క్రీడాకారులకు జిల్లా సెపక్‌తక్రా అసోసియేషన్ చైర్మన్ సప్తగిరి మల్లి, ప్రెసిడెంట్ ఎంఎస్ షాహిన్‌లు ప్రత్యేకంగా ఉరవకొండలో సత్కరించారు. చైర్మన్ సప్తగిరిమల్లి మాట్లాడుతూ మే 5 నుంచి 10 వరకు బిహార్‌లోని పాట్నాలో జరిగిన జాతీయ స్థాయి సెపక్‌తక్రా పోటీల్లో జిల్లాకు చెందిన ఎస్.అమృత, మానస, పవిత్ర, సురేఖ, సుస్మిత ఆంధ్రప్రదేశ్ తరఫున ఆడి రాజస్థాన్, కేరళ, బిహార్‌పై గెలుపొంది, కాంస్యపతకాలు సాధించారన్నారు.

భార్య పుట్టింటికి వెళ్లిందని భర్త ఆత్మహత్య

పామిడి: భార్య పుట్టింటికి వెళ్లడంతో మనస్తాపం చెంది ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. పామిడిలోని బీసీ కాలనీలో నివాసముంటున్న మాబూఖాన్ (30)కు గుంతకల్లుకు చందిన నజియాతో వివాహమైంది. వీరికి రెండేళ్ల వయసున్న కుమారుడు ఉన్నాడు. ఆరు నెలల క్రితం కుటుంబ కలహాల నేపథ్యంలో విసుగు చెందిన నజియా తన కుమారుడిని వెంటబెట్టుకుని పుట్టింటికి చేరుకుంది. నెలలు గడుస్తున్నా ఆమె కాపురానికి రాకపోవడంతో మనస్తాపం చెందిన మాబూఖాన్ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై సీఐ యుగంధర్ శుక్రవారం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

నేడు లక్ష్మీనృసింహుడి బ్రహ్మరథోత్సవం


పెన్నహోబిలంలో భక్తుల కోసం ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు

ఉరవకొండ/ఉరవకొండ రూరల్: పెన్నహోబిలం లక్ష్మీనృసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం బ్రహ్మరథోత్సవం వైభవంగా జరగనుంది. రథోత్సవాన్ని తిలకించేందుకు ఉమ్మడి అనంతపురం జిల్లాల నుంచే కాకుండా కర్ణాటక ప్రాంతం నుంచి కూడా భక్తులు వేలాదిగా తరలిరానున్నారు. దీంతో ఆలయ ఈఓ సాకే రమేష్ బాబు ఆధ్వర్యంలో ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తుల సౌకర్యార్థం ఆలయం చుట్టూ చలువ పందిళ్లు, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. తాగునీరు, ఉచిత భోజన వసతికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఉరవకొండ ఆర్టీసీ డిపో నుంచి పెన్నహోబిలం ఆలయానికి ప్రత్యేకంగా 42 ఆర్టీసీ సర్వీసులు నడపనున్నట్లు డిపో మేనేజర్ హంపయ్య తెలిపారు. రథోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 200 మంది పోలీసు సిబ్బందిని నియమించినట్లు ఉరవకొండ అర్బన్ సీఐ మహానంది తెలిపారు.

ఆలయ భూముల కౌలు వేలం

విడపనకల్లు: ఉండబండ వీరభద్రస్వామి ఆలయ భూములు కౌలుకు 21నుంచి వేలం ఉంటుందని ఈఓ విజయ్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. చీకలగురికి వద్ద సర్వేనంబర్‌లు 58ఏ– 28.50 ఎకరాలు, 58సీ–2.50 ఎకరాలు, 59–31.02 ఎకరాలు, 60 సీ–28.08 ఎకరాలు భూమిని ఈనెల 21న ఆలయంలో కౌలుకు వేలం వేస్తున్నట్లు తెలిపారు. పాల్తూరు, ఉండబండకు చెందిన 270ఏ–88.92 ఎకరాలు, 270సీ–7.30 ఎకరాలు, 22న కౌలు వేలం ఉంటుందన్నారు. గడేకల్లుకు చెందిన సర్వే నంబర్ 48లో 20.52 ఎకరాలు 23న వేలం ఉంటుందన్నారు.

ఘనంగా షాబాజ్ దీవాన్ వలీ ఉరుసు


దర్గాలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: కల్లుహోళ గ్రామంలో వెలసిన హజరత్ సయ్యద్ షాబాజ్ దీవాన్ వలీ ఉరుసు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం నుంచి వివిధ ప్రాంతాల నుంచి అనేక మంది కుటుంబ సభ్యులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. భక్తులు చాదర్‌లు, నూతన వస్త్రాలు, పుష్పమాలలు, అగరఒత్తులు అందించి, మొక్కులు తీర్చుకున్నారు. అనేక మంది భక్తులు తమ పిల్లలకు చక్కెర తూకాలు వేయించారు. దర్గా నిర్వాహకులు స్వామివారి చిహ్నాన్ని గ్రామ వీధుల్లో ఊరేగించారు.







క్లుప్తంగా

శుభకార్యం



వధూవరులను ఆశీర్వదిస్తున్న విశ్వేశ్వరరెడ్డి

వజ్రకరూరు: స్థానిక ప్రకాశమ్మ, ఆనంద్ దంపతుల కుమారుడు ప్రమోద్ కుమార్, కర్నూలు జిల్లా పర్లకు చెందిన సులోచనతో వివాహం శుక్రవారం జరిగింది. ఈవేడుకకు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీపీ.వీరన్న, మండల కన్వీనర్ సోమశేఖర్‌రెడ్డి, సర్పంచులు మోనాలిసా , మల్లెల జగదీష్ ,మైనార్టీ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు ఉస్మాన్, గ్రామ కమిటీ అధ్యక్షుడు రవికాంతరెడ్డి, ఉపాధ్యక్షుడు రాకెట్లబాబు, సీనియర్ నాయకులు మున్నా, కిరణ్ కుమార్, ప్రభుదాస్ హాజరయ్యారు.

పరామర్శ



కళ్యాణదుర్గంలో వసుంధరమ్మ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న రఘువీరా రెడ్డి

కళ్యాణదుర్గం రూరల్: కళాణదుర్గం మాజీ సర్పంచ్ వసుంధరమ్మ మృతి చెందిన విషయం విదితమే. శుక్రవారం మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత రఘువీరారెడ్డి కళ్యాణదుర్గంలోని బసవేశ్వర నగర్‌లోని మాజీ సర్పంచ్ వసుంధరమ్మ స్వగృహంలో కుటుంబ సభ్యులను పరామర్శించారు.

నేడు విద్యుత్ సబ్ స్టేషన్ల మరమ్మతు

బొమ్మనహాళ్: బెళుగుప్ప, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో శనివారం మరమ్మతులు చేస్తుండడంతో విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏఈ గంగాధర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.00 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరపరాలో అంతరాయం ఉంటుందన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన అవసరం



రాయదుర్గంలో సీజనల్ వ్యాధులపై ప్రతిజ్ఞ చేయిస్తున్న వైద్య సిబ్బంది



కూడేరులో డెంగీ దినోత్సవం సందర్భంగా ర్యాలీ చేస్తున్న దృశ్యం

రాయదుర్గంటౌన్: సీజనల్ వ్యాధులపై ప్రజలు అవగహన కలిగి ఉంటే నియంత్రణ సాధ్యపడుతుందని అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యుడు యశ్వంత్, మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం నేషనల్ డెంగీ డే సందర్భంగా పట్టణ శివారు బీటీపీ లేఅవుట్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో ప్రజలచే మానవహారం, డెంగీపై ప్రతిజ్ఞ చేయించారు. ఆరోగ్య విద్య బోధకుడు లక్ష్మీనారాయణ, హెల్త్ సెక్రటరీలు పాల్గొన్నారు.

కూడేరు: డెంగీని నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకమేనని మండల వైద్యాధికారిణి సాహితీ అన్నారు. శుక్రవారం కూడేరులో జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా వైద్యాధికారులు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి సాహితీ మాట్లాడారు. సీహెచ్ఓ సరోజమ్మ, సూపర్ వైజర్లు యశోద, రవీంద్ర, ల్యాబ్ టెక్నీషయన్ వేణుగోపాల్, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

వజ్రకరూరు: సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని గడేహోతూరు వైద్యాధికారి మారుతి, మలేరియా సబ్ యూనిట్ అధికారి కోదండరామిరెడ్డి అన్నారు. శుక్రవారం చాబాలలో జాతీయ డెంగీ మాసోత్సవ ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి మారుతి, మలేరియా సబ్ యూనిట్ అధికారి కోదండ రామిరెడ్డి, సూపర్ వైజర్ కుమారస్వామి, హెల్త్ అసిస్టెంట్ చంద్రా, ఏఎస్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: మండలంలోని దర్గాహొన్నూరు, శ్రీధరఘట్ట పీహెచ్‌సీ వైద్యాధికారులు సుల్తానా, కుమారరాజా ఆధ్వర్యంలో గ్రామాల్లో డెంగీ దినోత్సవంపై ర్యాలీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యు కేటర్ విజయభారతి, ఎంపీహెచ్ఈఓ లక్ష్మీనాయక్, ఆరోగ్య కార్యకర్తలు హేమాంజలి పాల్గొన్నారు.

గుమ్మఘట్ట: డెంగీ వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యులు రమేష్ తెలిపారు. శుక్రవారం జాతీయ డెంగీ దినోత్సవాన్ని మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు బాలాజినాయక్, సందేశ్, సీహెచ్ఓ మురళీధర్, సూపర్‌వైజర్ ఆదిబయమ్మ, ఏఎస్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కలసికట్టుగా ఆర్డీటీని కాపాడుకుందాం



కళ్యాణదుర్గం అంబేద్కర్ సర్కిల్లో ర్యాలీ చేస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ ఉద్యోగులు



మహంతపురంలో భోజన ఏర్పాట్లను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కళ్యాణదుర్గం రూరల్: కలసికట్టుగా ఆర్డీటీని కాపాడుకుందామని ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాల ప్రభుత్వ ఉద్యోగులు పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలో ఉద్యోగుల సంఘాల నాయకులు ర్యాలీ చేశారు. ఆర్డీఓ కార్యాలయంలో రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు చెలిమప్ప, ఎస్సీ, ఎస్టీ, బీసి ఉద్యోగ సంఘం నాయకులు రాజగోపాల్, రాజన్న, సురేష్, నారాయణ, జగదీష్ పాల్గొన్నారు.

ఆర్డీటీ ఎఫ్‌సీఆర్ఏను పునరుద్ధరించాలి..

ఆర్డీటీ ఎఫ్‌సీఆర్ఏను పునరుద్ధరించాలని తిమ్మాపురం సర్పంచ్ సంధ్య హరినాథ్ కోరారు. శుక్రవారం కంబదూరు మండల పరిధిలోని తిమ్మాపురంలో సేవ్ ఆర్డీటీ సేవ్- అనంత'లో భాగంగా కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు.

నేడు సేవ్ ఆర్డీటీ బైక్ ర్యాలీ

కుందుర్పి: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో శనివారం సేవ్ ఆర్డీటీ కార్యక్రమంలో భాగంగా బైక్‌ర్యాలీ నిర్వహించనున్నారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు, అన్ని వర్గాల వారు పాల్గొనాలని నాయకులు పిలుపునిచ్చారు. ఉదయం 11:40 గంటలకు మండలంలోకి బైక్ ర్యాలీ ప్రవేశిస్తుందని, ఆతర్వాత మధ్యాహ్నం 1 గంటకు మహంతపురంలో భోజన విరామం ఉంటుందన్నారు. పార్టీ మండల కన్వీనర్ హనుమంతరాయుడు, మహిళా విభాగం డివిజన్ అధ్యక్షురాలు నాగలక్ష్మీ, మహంతపురం సర్పంచ్ జగన్, ఐటీ విభాగం జిల్లా కార్యదర్శి నరేష్, నాయకులు భీమప్ప, నాగేంద్ర, మూర్తి, ఓబుశేసు, ఈరన్న పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో దోపిడీ అరికట్టాలి



మెట్టు విశ్వను కలసిన ఉపాధి మాజీ క్షేత్ర సహాయకులు

రాయదుర్గం: ఉపాధిహామీ పనుల్లో దోపిడీని అరికట్టాలని వైఎస్సార్‌సీపీ యువనాయకుడు మెట్టు విశ్వనాథరెడ్డి అన్నారు. శుక్రవారం తన నివాసంలో అయన కూటిమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత తొలగించిన ఉపాధి క్షేత్ర సహాయకులతో సమావేశం నిర్వహించారు. మెట్టు విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ఏపీలో రెడ్‌బుక్ రాజ్యాంగం సాగుతోందన్నారు. ఉపాధి క్షేత్రసహాయకులు, మెప్మా ఆర్పీలు, యానిమేటర్లు, ఆశ వర్కర్లు, స్టోర్ డీలర్లను అకారణంగా తొలగించి, వారి కుటుంబాలను వీధిన పడేశారన్నారు. మేట్ల వ్యవస్థను తెచ్చి, ఉపాధి పథకాన్ని పక్కదారి పట్టించేలా వ్యవహరిస్తున్నారన్నారు. అవినీతి, అక్రమాలపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. గుమ్మఘట్ట మండలంలోని పలు గ్రామాల్లో మస్టర్లలో మాయాజాలంపై ఉపాధి పీడీ దృష్టి సారించాలన్నారు. పనులకు రాని వారి పేర్లు దొంగ మస్టర్లు వేసి నిధులు పక్కదారి పట్టిస్తున్నట్టు బహిరంగంగా ఆరోపణలు వినిపిస్తున్నా పట్టించుకోవడంలేదని విమర్శించారు. కార్యక్రమంలో రాయదుర్గం, కణేకల్లు మండల కన్వీనర్లు రామాంజనేయులు, బ్రహ్మానందరెడ్డి, నాయకుడు ఎర్రగుంట కేశవరెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, ఆయా గ్రామాల తొలగించబడిన క్షేత్రసహాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

రేపు ఉద్యోగుల సంఘం ఎన్నికలు

కణేకల్లు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ హాలులో మండల ఉద్యోగుల సంఘం ఎన్నికలు ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఏపీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గోపీకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికల అధికారిగా వేణుగోపాల్, సహాయ ఎన్నికల అధికారిగా కేసీ నాగరాజును నియమించినట్లు తెలిపారు.

వజ్రకరూరులో భారీవర్షం



వజ్రకరూరులో కురిసిన వర్షం

వజ్రకరూరు: మండల కేంద్రంలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. 1 గంట పాటు వాన కురిసింది. దీంతో ప్రధాన రహదారులు, వీధుల్లో నీరు నిలిచింది. వర్షపు నీరు మెయిన్‌రోడ్ మీదుగా చెట్టుకుంటవైపు పరుగులు తీశాయి.

సబ్సిడీ విత్తన వేరుశనగ ఇవ్వండి

విడపనకల్లు: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు సబ్సిడీ విత్తన వేరుశనగ ఇవ్వాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బోయ వెంకటేశులు, రైతు సంఘం ప్రాంతీయ కార్యదర్శి రంగారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఖరీఫ్ ప్రారంభమవుతున్నా నేటికీ విత్తన వేరుశనగ పంపిణీ ఊసేలేదన్నారు.

నేడు ఇండియా ఓబయ్య జయంతి

కళ్యాణదుర్గం: స్వాతంత్ర్య సమరయోధులు, దివంగత ఇండియా ఓబయ్య 109వ జయంతి వేడుకలు శనివారం ఉదయం నిర్వహించనున్నట్లు ఆయన కుమారుడు, వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ కన్వీనర్ ఐ సుధీర్ తెలిపారు. ఈమేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. స్థానిక టీ సర్కిల్‌లోని ఓబయ్య విగ్రహం వద్ద జయంతి వేడుకలు జరుగుతాయన్నారు. పార్టీ సమన్వయకర్త, పీఏసీ సభ్యులు డాక్టర్ తలారి రంగయ్య హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు.



గజవాహనంపై శ్రీవారు










శ్రీదేవి, భూదేవీ సమేత ప్రత్యేక అలంకరణలో శ్రీనివాసుడు



గజ వాహనంపై భక్తులకు దర్శనమిస్తున్న వేంకటరమణస్వామి



ముస్తాబైన శ్రీవారి బ్రహ్మ రథోత్సవం

రాయదుర్గం టౌన్: స్థానిక ప్రసన్న వేంకటరమణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేతంగా గజ వాహనంపై భక్తులకు శ్రీవారు దర్శనమిచ్చారు. అంతకుముందు ఆలయంలోప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి.

నేడు శ్రీవారి బ్రహ్మరథోత్సవం

రాయదుర్గం: పట్టణంలోని కోట ప్రసన్న వేంకటరమణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రథోత్సవం జరగనుంది. ఉదయం 11 గంటలకు మడుగుతేరు నిర్వహించనున్నారు. సాయంత్రం 4 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాల్ని ఆలయం నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి బ్రహ్మ రథంలో అధిష్టిస్తారు. 5 గంటలకు వేదమంత్రోచ్చారణ మధ్య స్వామి రథం కదులుతుంది. వినాయక సర్కిల్ దాటుకుని బళ్లారి రోడ్డులోని బోడ్డురాయి వరకు స్వామి ఊరేగింపు ఉంటుంది. ఏర్పాట్లను శుక్రవారం రాత్రి అధికారులు పరిశీలించారు. చుట్టు పక్కల గ్రామాలతో పాటు కర్ణాటక రాష్ట్రం నుంచి భక్తులు వేలాదిగా తరలిరానున్నారు.



సూర్యప్రభ, ఐరావత వాహనాలపై లక్ష్మీనృసింహుడు



సూర్యప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిస్తున్న లక్ష్మీనారసింహుడు



విశేష అలంకరణలో భూదేవి, శ్రీదేవి సమేత లక్ష్మీనారసింహుడు

ఉరవకొండ రూరల్: మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీ నృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీవారు శుక్రవారం సూర్యప్రభ, ఐరావత వాహనాలపై భక్తులకు దర్శనిమిచ్చారు. ఉదయం స్వామికి సుప్రభాతం, మహాభిషేకం, అలంకరణ, బలిహరణ, మంగళహారతి తదితర కార్యక్రమాలు జరిగాయి. అనంతరం భూదేవి, శ్రీదేవి సమేత లక్ష్మీనృసింహస్వామి సూర్యప్రభ, ఐరావత వాహనాలపై భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ సాకే రమేష్‌బాబు, ప్రధాన అర్చకుడు ద్వారకానాథాచార్యులు, బాలాజీ స్వామి పాల్గొన్నారు.

విఘ్నేశ్వరాలయంలో సంకష్టహర చతుర్థి



ప్రత్యేక అలంకరణలో విఘ్నేశ్వరస్వామి

బెళుగుప్ప: మండల కేంద్రంలోని విఘ్నేశ్వరాలయంలో శుక్రవారం సంకష్టహర చతుర్థి పూజలు అభిషేకాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో రోజంతా ఉపవాసం ఉండి సామూహిక పూజలు చేశారు. అనంతరం స్వామి వారి ఉత్సవ విగ్రహంతో పల్లకీ సేవ నిర్వహించి, అనంతరం మహా మంగళహారతి, తీర్థ ప్రసాద కార్యక్రమాలు చేశారు.

గజలక్ష్మి ఆలయంలో విశేష పూజలు



ప్రత్యేక పూజలందుకున్న గజలక్ష్మిదేవి

రాయదుర్గంటౌన్: మల్లాపురం ఇందిరమ్మ కాలనీలో వెలసిన గజలక్ష్మి దేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి అభిషేకాలు చేసి, భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ప్రతి శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయడంతోపాటు కార్తీకమాసం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. పట్టణంలోని దుగ్గిలమ్మ ఆలయం, దండుమారెమ్మ ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.







